www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 జులై 2024
5
వైఎస్ఆర్

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

తప్పుకోండి..!

- రేషన్ దుకాణదారులపై టిడిపి నేతల హుకుం!
- ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు ఒత్తిళ్లు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు వేధింపులు
- మార్కెట్ యార్డు పోస్టులపైనా పెత్తనం

జిల్లాలో అధికార మార్క్ ఒత్తిడి రాజకీయం నడుస్తోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్రత పెరుగుతోంది. టిడిపి నాయకత్వం వైసిపి ప్రభుత్వ హయాంలోకి మేము రాలేదని, మా ప్రభుత్వ హయాం నుంచి తప్పుకోవాలని హుకూం జారీ చేస్తోంది. ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో నామినేటెడ్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కింది స్థాయి ఉద్యోగులు మొదలుకుని ఏజెన్సీల తొలగింపు రాజకీయానికి తెరలేపింది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చీ రావడంతోనే స్కీమ్ వర్కర్ల నుంచి రేషన్ దుకాణాలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మార్కెట్ యార్డు కార్యాలయాల పదవులకు, పోస్టులకు రాజీనామా చేసిన స్థానాలతోపాటు ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో ఉన్న వారిని సైతం వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తోంది. వైసిపి మద్దతుదారుల స్థానాల్లో తమ పార్టీ మద్దతు దారులను నింపుకునే ప్రయత్నాలను చేసుకుంటామని చెబుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో అధికార మార్క్ పాలన సాగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో 70 నుంచి 101 ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. గ్రామీణప్రాంతాలను ప్రభావితం చేసే శాఖలపై టిడిపి దృష్టి సారించింది. రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఉపాధి హామీ ఫీల్డ్‌అసిసెంట్లు, మార్కెట్‌యార్డు వంటి విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ కింద పలువురు ఉద్యోగాలు చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో పౌరసరఫరాల విభాగం పరిధిలో సుమారు 1,750 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీరిలో పలువురు వైసిపి మద్దతు కలిగిన రేషన్ దుకాణదారులు ఉన్నారు. కూటమి సర్కారులో ప్రధానమైన టిడిపి వైసిపి మద్దతుదారులపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తోంది. ఉదాహరణగా ఇటీవల కడప నగరంలో పలువురు బియ్యం వ్యాపారులను మొదలుకుని బియ్యం కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి మిల్లర్ల వరకు ఎవరినీ వదలకుండా కాంట్రాక్టులను, వ్యాపారాలను వదిలి వెళ్లిపోవాలని హుకూంలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఓ పోలీస్ కాంప్లెక్స్ లీజులను పంచుకునే ప్రయత్నం చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఇంతటితో ఆగకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లపై కన్నేసింది. సుమారు 600 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు. వీరిలో చాలామంది దశాబ్దాల తరబడి ఉపాధి హామీ పనుల్ని చేయిస్తున్నారు. ప్రతి పంచాయతీకి ఒకరు చొప్పున ఫీల్డ్‌అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో డ్వామా వైసిపి మద్దతుదారులకు నిలయంగా మారిందనే వాదనలు ఉన్నాయి. వైసిపి హయాంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇటువంటి వారి స్థానాల్లో ఆసక్తి కలిగిన టిడిపి మద్దతు దారులను నియమించేందుకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల వారీగా లెక్కలు సేకరించే ప్రయత్నం జోరుగా సాగుతోంది. జిల్లాలోని మూడు వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానం కింద మధ్యాహ్న భోజన ఏజెన్సీల నియామకంపై టిడిపి దృష్టి సారించింది. వీటితోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసిపి హయాంలో వైసిపి నాయకులు నిల్వ చేసుకున్న ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని టిప్పర్ రూ.15 వేల చొప్పున అమ్ముకున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 36 మార్కెట్ యార్డులు ఉన్నాయి. వైసిపికి చెందిన చైర్మన్లు మొదలుకుని డైరెక్టర్ల వరకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరి స్థానాల్లో టిడిపి మద్దతుదారులను నియమించుకునే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. మార్కెట్‌యార్డులో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు కింది స్థాయి ఉద్యోగుల తొలగింపునకు ఒత్తిళ్లు చేస్తున్నారు. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ట్రిపుల్‌ఐటి, జెఎన్‌టియు, కెజిబివి విభాగాల్లో పలు నియామకాలపై టిడిపి నేతలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి ఔట్‌సోర్సింగ్ స్థానాల్లో టిడిపి మద్దతుదారులను నియమకాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

చర్చించేనా!

- ఖరీఫ్‌పై సమగ్ర చర్చ అవసరం
- ప్రశ్నార్థకంగా ఉక్కు పరిశ్రమ పనులు
- అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ ఏదీ?
- 'కొప్పర్తి' పైప్‌లైన్ ఎప్పుడో?!
- నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ఉమ్మడి జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించడంపై సందేహం నెలకొంది. మంగళవారం జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ శారద అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఖరీఫ్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న ఎరువులు, విత్తన, అన్నదాతా సుఖీభవ నిధుల జమ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక. విద్య, వైద్య రంగాలు ఎదర్కొంటున్న ప్రతికూల పరి స్థితులు జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. కడపలో రహదారుల విస్తరణ దగ్గర నుంచి జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ భవన నిర్మాణ నాసిరకం పనులు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణ పనులు ఉక్కు పరిశ్రమ పనుల్లో పురోగతి, కొప్పర్తి పైప్‌లైన్ పనులపై ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. అధికార టిడిపి నుంచి పాలకపక్ష తప్పిదాలను నిలదీసే అవకాశాలు సన్నగిల్లిన నేపథ్యంలో సమగ్ర చర్చ దేవతావస్త్రంలా మారింది. కూటమి సర్కారు అధికారంలోకి రావడం, జిల్లాలో టిడిపికి ఐదు అసెంబ్లీ, జనసేన, బిజెపిలకు ఒకటి చొప్పన సీట్లు లభించిన నేపథ్యంలో మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆసక్తికరమైన చర్చకు అవకాశం లభించనుందనే ఆసక్తి నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ సా..గుతోంది. అన్నమయ్య జిల్లాలో క్షామపీడిత పరిస్థితులే కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా రైతాంగ పరిస్థితులపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉరుముతోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాతా సుఖీభవ నిధుల జమ వంటి పలు అంశాలపై చర్చించాల్సి ఉంది.కెసి కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాల్సి ఉంది. కడప నగరంలో రహదారుల విస్తరణ సా...గుతూనే ఉన్నాయి. కడప నగరంలోని ముంపు ప్రాంతాల పరిరక్షణకు ప్రకటించిన స్ట్రోమ్ డ్రెయిన్ పనుల్ని పట్టాలకు ఎక్కించాల్సి ఉంది. అన్నమయ్య, గండికోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదుకుంటామని హామీ నిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కొరవడింది. పింఛా, ఎల్ఎస్‌పి గేట్లకు మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీల పరిష్కారం, యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కా రమవుతుందో తెలియడం లేదు. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీని నిలు పుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా జీవనాడిగా మారిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం మారి టిడిపి, జనసేన, బిజెపి కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారనుందా అనే సందేహం వెంటాడుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలులో వైఫల్యం జిల్లా ప్రజలకు శాపంగా మారింది. గతేడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు ఆశించిన పురోగతి కనిపించకపో వడం ఆందోళన కలిగిస్తోంది. కొప్పర్తికి రూ.150 కోట్ల నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఫలితంగా జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై అర్థవంతమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన జగన్, షర్మిల

తల్లితో కలిసి వేర్వేరుగా ఇడుపులపాయలో ప్రార్థనలు

ఇడుపులపాయలో తండ్రి సమాధికి నివాళ్ళు అర్పిస్తున్న మాజీ సిఎం జగన్‌రెడ్డి

ప్రజాశక్తి-వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద తల్లి విజయమ్మ, భార్య వైఎస్.భారతి, ఇతర కటుంబ సభ్యులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. అక్కడే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో చివరి రోజు జగన్ పులివెందుల నుండి 7.55 నిమిషాలకు ఇడుపులపాయకు జగన్ మోహన్‌రెడ్డి రాగా అప్పటికే ఘాట్ వద్ద తల్లి విజయమ్మ పది నిమిషాలు పాటు ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన మాజీ సిఎం సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహనికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం అక్కడికి వచ్చిన వైసిపి కార్యకర్తలు, నాయకులను జగన్ పలకరించారు. అనంతరం ఇడుపులపాయలోని గెస్ట్‌హౌస్‌కు వెళ్లకుండా నేరుగా వైఎస్ఆర్ ఘాట్ వద్ద నుండి రోడ్డు మార్గంనా కడపకు బయలుదేరి వెళ్లారు. మాజీ సిఎం జగన్ ఘాట్ వద్ద నుండి వెళ్లిన తర్వాత 8.45 నిమిషాలకు పిసిసి అధ్యక్షులు షర్మిల తన భర్త అనిల్ కుమార్, తల్లి విజయమ్మ, కుమార్తె అంజలి, కుమారుడు రాజారెడ్డి, కోడలు అట్లూరి ప్రియా, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలిసి వైఎస్ఆర్ ఘాట్ వద్దకు విచ్చేశారు. షర్మిల అరగంట పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలమాలలతో నివాళులర్పించారు. సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహనికి నివాళులర్పించారు. అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ ఒక డైనమిక్ లీడర్ అన్నారు. నాయకుడు అంటే ఎలా ఉండాలని ఆదర్శంగా నిరూపించిన నాయకుడు వైఎస్ఆర్ అని పేర్కొన్నారు. గొప్ప పరిపాలన అందించాడు కాబట్టే ఆయన మరణానంతరం వైఎస్ఆర్ వెనకాల 700 మంది చనిపోయినట్లు తెలిపారు. వైఎస్ఆర్ గురించి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మాజీ సిఎం ఇడుపులపాయకు రావడంతో దారిపోడవున పోలీసులు గస్తీ నిర్వహించారు. ఘాట్‌లోకి ఎక్కువ మందిని పోలీసులు అనుమతించలేదు. సిఎం హోదాలో ఉన్న సమయంలో ఇడుపులపాయలో ఎన్ని చెక్ పోస్టులు పెట్టారో అదే మాదిరిగా చెక్ పోస్టులు పెట్టి పోలీసులు తనిఖీలు చేశారు. మాజీ సిఎం జగన్ వెంట కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ తనూజా రాణి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, గోవింద్‌రెడ్డి, రమేష్ యాదవ్, మాజీ మంత్రి ఉషశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, మాజీ సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ ఉన్నారు. షర్మిల వెంట పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాష, సలావుద్దీన్, విజయ జ్యోతి, అఫ్జల్‌ఖాన్‌తో పాటు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు.

తండ్రి సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పిస్తున్న పిసిసి చీఫ్ షర్మిల

ప్రతి విద్యార్థికి నైపుణ్యం ముఖ్యం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - చెన్నూరు

ప్రతి విద్యార్థీ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ పేర్కొన్నారు. వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా సోమవారం చెన్నూరు గ్రామ పరిధిలోని వనం ప్రాంతంలో ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థీ ఆరోగ్య విద్యతో పాటు సామాజిక వైద్యం, పరిశోధనా లక్ష్యంగా చేసుకొని నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం పై దిశా నిర్దేశాలను సూచించారు. ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి వైద్య విద్యార్థికి రోజుకు నిర్దేశించిన ఐదు గృహాలలో సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామస్తుల బిపి, షుగర్, బరువు, ఎత్తు, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలపై సర్వే చేస్తారన్నారు. 11 రోజులు సిబ్బంది అందరూ కలిసి ఆరోగ్య విషయాలను గ్రామస్తుల నుంచి సేకరించి సమగ్ర నివేదికను రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బి. గోపికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ చందన, డాక్టర్ చెన్నారెడ్డి, పిజి, యుజి విద్యార్థులు పాల్గొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా చేతన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా ప్రొద్దుటూరు నియోజకవర్గం వైఎంఆర్ కాలనీకి చెందిన బిజివేముల చేతన్‌కుమార్‌రెడ్డిని నియమించారు. సోమవారం నగరంలోని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బొజ్జ. తిరుమలేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆశీర్వాద బలంతో తెలుగుదేశం పార్టీ నాయకత్వ విద్యార్థుల పక్షాన నిలబడి వారి సంక్షేమ పరిరక్షణ కోసం పోరాడి అండగా నిలిచేందుకు చేతన్ కుమార్ రెడ్డిని ఉపాధ్యక్షుడిగా నియమి ంచామన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరి లోకేష్, నగర అధ్యక్షుడు అనిల్, జిల్లా నాయకులు రాజేష్, విశ్వనాథ్, నాయి బ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు గోవిందు, నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, కిరణ్, శరత్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న చేతన్‌కుమార్‌రెడ్డి

ఆర్‌జెడిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు

- కర్నూల్ డిఇఒ కె.శామ్యూల్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కె.శామ్యూల్

అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వై.రాఘవ రెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోనా శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్‌కి కడప ఆర్‌జెడిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవలు అందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఒక్కరూ సేవలు అందించాలని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అధ్యక్షులు అబ్దుల్ షబ్బీర్ కోరారు. సోమవారం నగరంలోని జడ్‌పి కార్యాలయం వద్దనున్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో ఇస్లామిక్ 1446వ నూతన సంవత్సరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వినికిడి మిషిన్, వృద్ధుల స్టిక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ ఇస్లామిక్ నూతన సంవత్సరం ప్రారంభమైన శుభ సందర్భంగా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంతో సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ శ్రీనివాసరెడ్డి, కేర్ టేకర్ ఎస్.ఎం రియాజ్, జయమ్మ పాల్గొన్నారు.

'ఉపాధి' ద్వారా పండ్ల తోటల పెంపకం : ఎపిఒ

ప్రజాశక్తి-చెన్నూరు : ఉపాధి ద్వారా నూరు శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకం చేపట్టవచ్చని ఉపాధి హామీ పథకం ఎపిఒ బి. శైలజ పేర్కొన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20 వరకు హార్టికల్చర్ సాగు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3.5 ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగిన చిన్న,సన్నకారు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి, చీనీ, సన్న నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు నాటుకొంటే మూడేళ్లపాటు ప్రభుత్వం ద్వారా నూరు శాతం ఉచితంగా నిర్వహణా ఛార్జీలు చెల్లిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి కల్గిన రైతుకు మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఎపిఒను సంప్రదించాలన్నారు.

ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా వెంకటపతి

ప్రజాశక్తి - కడప : కడప ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా జె. వెంకటపతి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఉత్తర్వుల మేరకు నేషనల్ హైవే విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను కడప ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం వెంకటపతి బాధ్యతలు చేపట్టారు.

రాజీనామాలు సరే.. నియామకాలు ఎప్పుడు?

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో-కన్వీనర్ ఎం.ఆర్.నాయక్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగానున్న యూనివర్సిటీ విసి, రిజిస్ట్రార్‌లు రాజీనామాలు చేశారని, మరి వాటి నియామకాలు ఎప్పుడని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో-కన్వీనర్ ఎం. ఆర్.నాయక్ ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ వైవీయూ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే వివిధ కారణలతో రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీ విసిలు, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే అన్నారు. వారి నియకమాలు ఎప్పుడు చేస్తారు, ఉన్నత విద్య చైర్మన్‌ను ఎప్పుడు నియమిస్తారు, పీజీ అడ్మిషన్ పక్రియ ఎప్పుడు మొదలవుతుందో యూనివర్సిటీ విద్య సంవత్సరం ఎప్పుడు గాడిలో పడుతుందో తెలియని పరిస్థితిలో యూనివర్సిటీలు ఉన్నాయని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి జరగాలంటే విసి, ఇసి సభ్యులు రిజిస్ట్రార్‌గా కిలకంగా వ్యాహరిస్తారని ఇందాత జరగాలి అంటే ఉన్నత విద్య చైర్మన్ ఉండాలన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విద్య చైర్మన్ రాజీనామా చేసి నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య చైర్మన్‌ని ఇంత వరకు నియమించలేదని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య చైర్మన్, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్నా విసి, రిజిస్ట్రార్‌ల నియామక పక్రియ ప్రారంభించి ఉన్నత విద్య సంవత్సరాన్ని గాడిలోకి పెట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలో జరిగిన అవినీతిలపై సిబిఐ విచారించి నేర ఆరోపణ రుజువైనా వారిపై క్రిమినల్ కేసులు వేయాలని లని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో ఆందోళనలు ఉదృతం చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ వైవీయూ నాయుకులు రాకేష్,విజయ్, శివ, మనోజ్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్ : బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రత చర్యలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్ చర్యలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో తాజాగా జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలు మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఫ్యాక్టరీల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, క్రైసిస్ గ్రూప్ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సేఫ్టీ నిబంధనల ప్రకారం ఖచ్చితంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించారు. ఒక చిన్న మానవ తప్పిదం వల్ల, కార్మికుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం రాకూడదని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కృష్ణ మూర్తి, పరిశ్రమల సాక్ జెడ్‌ఎం (టెక్) శ్రీనివాస మూర్తి, జీఎం జయలక్ష్మి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ధర్మారావు, ఇండియా సిమెంట్స్, భారతి సిమెంట్స్, దాల్మియా, జువారి సిమెంట్స్ తదితర పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ మార్నింగ్ విసిట్‌లో భాగంగా పుట్లంపల్లి ఎంసిసి, ఎంఆర్‌ఎఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, సిఅండ్ డి వెస్ట్ ప్లాంట్, ఉక్కాయపల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వినాయక నగర్ జీఎస్, శానిటేషన్, ఇంజి నీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. పుట్లంపల్లి ఎంసిసి వద్ద కుంగిపోయిన బేవర్స్ వెంటనే యధాస్థితికి వచ్చే విధంగా ఎర్త్ వర్క్ చేసి బేవర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశి ంచారు. ఎంసిసిలో పిట్స్ వద్ద పైప్స్ ట్రెన్ లోపల అమర్చే విధంగా చర్యలను చేపట్టాలని తద్వారా మాగౌట్స్ బయటికి రాకుండా ఉంటాయని ఇంజి నీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. ఎంసి సిలో తయారైనటువంటి మైక్రో కంపోస్ట్ హోమ్ గార్డెన్ చేసుకునేటువంటి ప్రజలకు ఉచితంగా అందించాలని సూచించారు. వారం రోజుల నుంచి ప్రతి జోన్ నుంచి వచ్చినటువంటి తడి, పొడి చెత్త వివరాలను పరిశీలించి తడి చెత్తను రోజూ 6 టన్నులకు తగ్గకుండా సేకరించాలన్నారు.

విద్యార్థులకు ఫుట్‌బాల్లను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటాలి

ప్రజాశక్తి - వేంపల్లె

చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిచ్చిరెడ్డి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సాజీద్ హుసేన్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పిచ్చిరెడ్డి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కడప శాఖ ఆధ్వర్యంలో క్రీడలకు సంబంధించి ఫుట్‌బాల్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాల్లో ఉత్సాహం, ఆనందం అనేది ఉంటుందన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. సమగ్ర వికాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలను ప్రోత్సాహించేందుకు ఆట వస్తువులను తమ సంస్థ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివమునెమ్మ, సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12న చాపాడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 12న చాపాడు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రహంతుల్లయ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవు తారన్నారు. మండలస్థాయి అధికారులు తమ శాఖల పూర్తి నివేదికతో హాజరుకావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి సమావేశం దృష్టికి తేవాలని ఎంపిడిఒ కోరారు.

బయో ప్రొడక్ట్ విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎరువుల దుకాణాల్లో బయో ప్రొడక్ట్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌టిఎల్ తిరుపతి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ఎం.ఈ ప్రసాద్ హెచ్చరించారు. పట్టనంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మహాలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణంలో 3 ఎరువుల నమూనాలు, భారత్ సీడ్స్‌లో రెండు విత్తనాల నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపామని అధికారులు తెలిపారు. రికార్డు సరిగా లేని రూ.1,17,855 మందులు నిలుపుదల చేశామన్నారు. తిరుమల సీడ్స్‌లో రికార్డు సరిగాలేని రూ.17,440 మందులు అమ్మకాలు ఆపేశామన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, అనుమతి లేని ఎరువులు అమ్మిన వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ ఈదురు బాషా, జేడీ కార్యాలయ ఎఒ గోవర్ధన్, స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మటన్, చేపలు స్టాళ్ల బహిరంగ వేలం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘానికి సంబంధించి పార్నపల్లె రోడ్డులో ఇటీవల కాలంలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ మీట్ మార్కెట్‌లో ఉన్న మటన్, చేపలు స్టాళ్ల కార్యాలయ బహిరంగ వేలం ఈనెల 24న వేస్తున్నట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 24న బహిరంగ వేలానికి పిలిచామని, అప్పుడు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. వేలానికి వచ్చేవారు ఈనెల 24న ఉదయం 10 గంటల లోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డయేరియాను అరికట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ అధికారులు తక్షణమే డయేరియా ప్రబలకుండా అరికట్టాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ సూచించారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో డయేరియా తీవ్రంగా ప్రబలుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వ అధికారుల ముందస్తు జాగ్రత్తలు కనపడడం లేదన్నారు. ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి ముందస్తు జాగ్రత్తలు తీసుకోమని చెప్పినప్పటికీ ప్రభుత్వ అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపె పెడుతున్నారన్నారు. జ్వరం రావడం, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, నీరసంతో అవగాహన లేని ప్రజలు తాత్కాలిక ఉపశమనం కోసం గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపిలతో వైద్యం చేయించుకుంటూ.. వారు మరింత తీవ్రమైన అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఉన్నత స్థాయి వైద్య అధికారులు ప్రజల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.వినయకుమార్, భాస్కర్‌రెడ్డి, ఆదాము, బాషా, మున్నా పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దోమలు వృద్ధి చెందకుండా, అవి కుట్టకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి రాజీవ్ సర్కిల్ వరకు సోమవారం 'కీటక జనిత వ్యాధులు, స్టాప్ డయేరియా'పై కమిషనర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఎక్కువగా ఉంటాయన్నారు. దోమలు కుడితే డయేరియా, డెంగీ వ్యాధులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దినేష్, భరత్ నారాయణ, హలీమ్, హిమబిందు, పూజిత, మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, సబ్-యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, మెప్మా టిఐ కెజియా, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, కమాల్‌బాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, సూపర్‌వైజర్ జయమ్మ, సిఇఒ సుబ్బారెడ్డి, నాగజ్యోతి, మున్సిపల్, సచివాలయం, మెప్మా, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రైతులకు భరోసానివ్వని కేంద్రాలు

అన్నదాతలకు ఉపకరించని వైనం.. నూతన ప్రభుత్వంలోనైనా రైతులకు చేరువయ్యేనా..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అన్ని విధాలా రైతన్నలకు అండగా ఉండేందుకు వారి ఇంటి వద్దనే సేవలందించేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ఉద్దేశం ఆచరణలో నెరవేరుతుందన్న పరిస్థితి కనిపించడం లేదు. రైతులు పంట సాగు మొదలు పెట్టిన దగ్గర నుంచి తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించే వరకు అన్ని విషయాల్లోనూ పూర్తి సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు వచ్చాయి. పంటల సాగు ప్రారంభంలో భూసార పరీక్షల నుంచి మెళకువలు తెలియజేయడం, రైతులకు కావలసిన సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం అందించడం, యంత్ర సామగ్రిని సమకూర్చడం, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు రైతుల వద్దకు చేరేలా చూడడమే రైతు భరోసా కేంద్రాల ముఖ్య ఉద్దేశం.

మూడేళ్లుగా అరకొరగా భూసార పరీక్షలు..

పంట దిగుబడులు తగిన నాణ్యతతో బాగా రావాలంటే ముందుగా భూసార పరీక్షలు అవసరం. రైతులు పొలం బాట పట్టడానికి ముందు గ్రామాలవారీగా భూసార పరీక్షలు జరపాలి. పంటల సాగుకు ఇది కీలకం. పంట ప్రారంభానికి ముందు మట్టి నమూనాల సేకరణ జరిపి, సాగు భూమిలో ఏవి లోపించాయో తెలుసుకుని తదనుగుణంగా ఎరువులు వాడాలి. కానీ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూసార పరీక్షలు జరిపింది లేదు. భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలకు సంబంధించిన పరికరాలు సమకూరలేదు. కొన్ని చోట్ల ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కారణంగా భూసార పరీక్షలు రైతులకు అందుబాటులోకి రాలేదు.

నిరుపయోగంగా డిజిటల్ కియోస్క్‌లు..

రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దిన ఈ పరికరం ద్వారా రైతులు తమకు కావలసిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఇతర వ్యవసాయ

రైతు భరోసా కేంద్రం

ఉత్పాదకాలను తమ గ్రామం నుంచే ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి పొందవచ్చు. పంటల సాగులో నూతన పద్ధతులను ఇక్కడి వీడియోల ద్వారా చూడవచ్చు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కాకుండా పాత రెవెన్యూ గ్రామాలను ప్రాతిపదికగా తీసుకొని వీటిని ఏర్పాటు చేశారు. కానీ డిజిటల్ కియోస్క్‌లు ఎక్కడ కూడా రైతులకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. రైతులు ఆర్‌బికెలకు వెళ్లి తమకు కావలసిన ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయవచ్చని, రైతులు ముందుగా తమకు ఏమీ కావాలో చెబితే వాటిని తెప్పించి ఇస్తామని అధికారులు చెప్పారు. రైతులు ముందే నగదు మొత్తం చెల్లించి వాటిని తీసుకోవలసి ఉంటుందన్నారు. సాధారణంగా రైతులు సీజన్‌లో తమకు తెలిసిన షాపుల వారి నుంచి ఎరువులు, పురుగుమందులు అరువుకు తెచ్చుకొని పంట వచ్చాక అమ్మి చెల్లింపులు జరుపుతారు. కానీ ఆర్‌బికెల్లో అలా కుదరదు. ఎవరైనా ముందుగానే నగదు చెల్లించి తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా పురుగు మందుల విషయంలో రైతులు అప్పటికప్పుడు పంటపై వాడాల్సి ఉంటుంది. ఇలా ముందుగా ఆర్డర్ పెట్టి అవి వచ్చాక కొని పంటపై చల్లడం అనేది ఆచరణలో కుదిరేది కాదు. కనుక డిజిటల్ కియోస్క్‌లు రైతులకు ఉపయోగపడిందేలేదు.

రైతులకు చేరని వ్యవసాయ పరికరాలు..

మండలాల వారీగా రైతులను గ్రూపులుగా చేసి వారికి రాయితీతో కూడిన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా వీలు కల్పించారు. గ్రామం యూనిట్‌గా ఏర్పాటు చేసిన రైతు గ్రూపులకు రూ.15 లక్షలపైన విలువగల పరికరాలు ఇస్తామని చెప్పారు. ట్రాక్టర్లు, నాగళ్ల, నూర్పిడి యంత్రాల వంటి వాటిని రైతులు కొనుక్కోవచ్చు. ఈ పథకం కూడా చేరువకాలేక పోయింది. కొంత మేర రైతులను గ్రూపులుగా చేసినా సదరు పరికరాల కొనుగోలు కోసం కావలసిన నిధులు ప్రభుత్వం నుంచి సక్రమంగా వచ్చిన దాఖాలు లేవు. అలానే సదరు పరికరాలు మార్కెట్ ధర కన్నా కొన్నిసార్లు ఎక్కువగా ఉండడం, ముందుగానే మొత్తం నగదు చెల్లించడం వంటి షరతుల వల్ల ఈ వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలు పథకం రైతులకు ఉపయోగపడలేదు.

అందుబాటులోకిరాని బ్యాంకింగ్ సేవలు..

రైతులకు అవరమైన బ్యాంకింగ్ సేవలను ఆర్‌బికెల ద్వారా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం బ్యాంకింగ్ కరస్పాండెంట్లను (బిసిలు) ఆర్‌బికెల్లో నియమించి వారి ద్వారా రైతులకు సులభతరంగా రుణాలు ఇప్పించాల్సి ఉంది. జిల్లాలో ఎక్కడా కూడా ఆర్‌బికెల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చిన దాఖలాలు లేవు. బ్యాంకింగ్ కరస్పాండెంట్లు ఆర్‌బికెల్లో రోజులో కొన్ని గంటలు ఉండడం ద్వారా రైతులు ఆన్‌లైన్ నగదు జమలు, కొద్దిపాటి రుణం పొందడం సాధ్యపడేది. జిల్లాలోని ఏ ఒక్క ఆర్‌బికెలో కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ఇలా పలు రకాల కారణాలతో రైతు గడప వద్దనే సేవలందించేందు కోసం ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాలు ప్రభుత్వం చెప్పిన విధంగా రైతులకు చేరువకాలేక పోయాయి. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి అయినా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల అవసరం మేరకు సేవలు పూర్తి స్థాయిలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నూతన ప్రభుత్వంలో అయినా ఆర్‌బికెలను రైతులకు అండగా నిలపాల్సి ఉంది.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి -కడప

మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లెం విజయ భాస్కర్, నల్ల కదిరిగాళ్ల శాంతయ్య, సుజాత రెడ్డి, శ్యామలమ్మ, కదిరి ప్రసాద్ గౌడ్, మామిళ్ళ బాబు, మామిల్ల నరసింహులు, కోపూరు శ్రీనివాసులు, కోటపాటి లక్ష్మయ్య, గున్నంపాటి వెంకటరమణ, అఖిల్, మహేష్, పిడి సంజయ్ కాంత, చిన్న కుల్లయప్ప, కే గంగాధర్, షేక్ కమల్ బాషా, సంతోషమ్మ చాంద్ బి, విజయకుమారి, తాజ్ మహమ్మద్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** రాజశేఖర్ రెడ్డి జయంతి పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ పార్లమెంటరీ ఇంచార్జి పీస్ సయ్యద్ గౌస్ పీర్ 200 మంది పారిశుధ్య కార్మికులకు, పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పాలన ప్రజా పాలన అని, పేద,బడుగు, బలహీన వర్గాలకు ఆయన ఆశాజ్యోతి అన్నారు. ఆయన పరిపాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాయని చెప్పారు. **చెన్నూరు :** కడప- కర్నూల్ జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డులో వైసిపి సీనియర్ నాయకులు, కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెడబల్లి గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువ నాయకులు పెడబల్లె ప్రతిప్ కుమార్ రెడ్డి. మాజీ నేటి సంఘం డైరెక్టర్ లక్ష్మిరెడ్డి. ఎంపీటీసీ చంద్ర. టిఎన్ చంద్రారెడ్డి రమేష్ ప్రసాద్ కిట్టు వెంకటసుబ్బయ్యతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఎన్ భాస్కర్‌రెడ్డి నాయకులు ఎర్ర సాని మోహన్‌రెడ్డి, సర్పంచ్ కళ్యాణ్. సిద్ధవటం హరి, ఎంపిపి సురేష్, మైనార్టీ నాయకులు మునీర్ అహ్మద్, అన్వర్‌బాషా, బాషా బిసి నాయకులు అల్లి శ్రీరామ్మూర్తి. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిరెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం వైసిపి మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో నాగంనాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి, హేమంత్, అంజి, చిన్న, గోపాలకృష్ణ, పుల్లయ్య, నాగరాజు, వెంకట్, శ్రీనివాసులు, రమణ పాల్గొన్నారు. **చాపాడు :** మండల కేంద్రమైన చాపాడుతోపాటు గుంత చియ్యపాడు, అనంతపురం తదితర గ్రామాల్లో సోమవారం వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాపాడులో ఎంపిపి టి.లక్షుమయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గుంత చియ్యపాడులో ఎంపిటిసి సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి మహేష్ యాదవ్, అనంతపురం గ్రామంలో వైసిపి నాయకులు సివి సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జయ సుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** వైఎస్ జయంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సుంకేసులలో వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, రెడ్యం రామకృష్ణారెడ్డి, ఎంపిటిసి రాముడు, మాజీ సర్పంచ్ మీగడ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు అంబటి శివారెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి, మిడుతూరు చంద్ర పాల్గొన్నారు. మండల పరిధిలోని పంచాయతీ కేంద్రమైన బి.కొత్తపల్లి గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని వైసిపి జిల్లా కార్యదర్శి జి.నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **సింహాద్రిపురం :** డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో, గురిజాల క్రాస్‌లో, వైఎస్ఆర్ మెమోరియల్ పార్క్‌లో, కుమ్మరాంపల్లి కాలనీలోని వైఎస్ విగ్రహాలకు మండల వైసిపి కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి నాయకులు వి.రాజగోపాల్‌రెడ్డి, శివచంద్రారెడ్డి, అరవిందనాథరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మైదుకూరు :** వైసిపి నాయకులు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాచమల్లు రవిశంకర్‌రెడ్డి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వైసిపి నేతలు రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కుర్రాకుల వెంకటేష్ ఆధ్వర్యంలో అందజేశారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి లక్ష్మీగాయిత్రి, రామగంగిరెడ్డి, షబ్బీర్‌వలి, ప్రసాద్‌రెడ్డి, మునీర్, షేక్షావలి, ఎంపిటిసిలు బ్రహ్మయ్య, కటిక చంద్రశేఖర్, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, నాగేంద్ర, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, నరసింహగౌడ్, బికారి, బండల షకూర్, ఆది, కమతం రాజా, ప్రదీప్ కుమార్ రెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హబీబ్, భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** వైఎస్ జయంతి సందర్భంగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆయన విగ్రహాలకు వైసిపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నాయకులు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, హాల్ గంగాధర్‌రెడ్డి, మాజీ చైర్మన్ రసూల్, వైస్ చైర్మన్ హాఫీజ్, జేసియస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, నాయకులు వీర, బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు ప్రసాద్, బ్యాటరీ ప్రసాద్, రాజేష్, రత్నం, కోళ్ల భాస్కర్ పాల్గొన్నారు **జమ్మలమడుగు రూరల్ :** వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్ కిరణ్ ఘన నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి పాత్రికేయులకు సమాచారం ఇవ్వకుండా తన ముఖ్య అనుచరులతో కలిసి సాయిరాం థియేటర్ వద్దనున్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** స్థానిక పురుగు మందుల దుకాణాలపై వ్యసాయ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి గణేష్ ట్రేడర్స్ దుకాణంలో అమ్మకాలకు సంబంధించి వ్యత్యాసం ఉండడం వల్ల అమ్మకాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు అధికారులు ప్రసాద్‌రెడ్డి, గోవర్ధన్, ఎఒ నాగార్జున తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. **ప్రొద్దుటూరు :** మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మైదుకూరు రోడ్డులోని వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్-చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజీ, బంగారురెడ్డి మున్సిపల్ కార్యాలయంలోని వైఎస్ విగ్రహానికి పూల మాలవేసి నివాళుర్పించారు. **ఇడుపులపాయలో కాంగ్రెస్ నాయకులు..** కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్, కాంగ్రెస్ నాయకుడు, కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా ఇడుపులపాయ వెళ్లి పిసిసి అధ్యక్షురాలు షర్మిలతో కలిసి వైఎస్ ఘాట్‌లో నివాళులర్పించారు.

కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహ రెడ్డి, నాయకులు

మైదుకూరు : అల్పాహారం పెడుతున్న వైసిపి నాయకులు

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు, భూపేష్ రెడ్డి

'రాజోలి' నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలోని రాజోలి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి అక్కడి రైతులను, ప్రజలను ఆదుకోవాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. సోమవారం వారు అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిశారు. భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రాజోలి ప్రాజెక్టు నిర్మాణం పేరుతో గత ప్రభుత్వం పెద్దముడియం మండలంలోని కుందూనది పరివాహక గ్రామాలను సర్వే చేసి రైతుల భూములను సీజ్ చేసిందన్నారు. వారికి చెప్పిన పరిహారం ఇవ్వలేదన్నారు. రైతులు తమ భూములు అమ్ముకోవడానికి వీలు లేకుండా సీజ్ చేయడంతో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయలేకపోతున్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు నష్ట పరిహారం పెంచి న్యాయం చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు. కొండాపురం మండల ప్రజలకు గండికోట ప్రాజెక్టు ముంపు పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

క్షయ వ్యాధి నివారణకు అర్హులైన అందరూ తప్పక సహకరించాలని పిహెచ్‌సి ఆరోగ్య పర్యవేక్షకుడు బిఎ వరప్రసాద్, ప్రొద్దుటూరు క్షయ వ్యాధి నివారణ పర్యవేక్షకుడు ఉస్సేన్ బాషా పేర్కొన్నారు. సోమవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని సచివాలయాల్లో జరుగుతున్న అడల్ట్ బిసిజి టీకా కార్యక్రమాన్ని చెన్నమరాజుపల్లె, హౌసింగ్ బోర్డు, గోపవరం, భగత్ సింగ్ కాలనీ, చౌటపల్లిలో పరిశీలించారు. బిసిజి వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వైద్యులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ కృష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, సిహెచ్‌ఒ ప్రణీత, ఎఎన్‌ఎంలు యశోద, ఝాన్సీరాణి, మాణిక్యమ్మ, ఆశా కార్యకర్తలు బిందు, నాగలక్షుమ్మ, స్వర్ణలత, శ్రీవాణి, సువార్తమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

బిసిజి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పలు దుకాణాల్లో చోరీలు

హడలెత్తుతున్న పట్టణ వాసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని పాత బస్టాండ్, నాలుగు రోడ్ల కూడళ్లలో ఉన్న పలు దుకాణాల్లో ఆదివారం రాత్రి నగదు,సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు సోమవారం బాధితులు తెలిపారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న అశోక్ షాపులో రూ.14,300 నగదు, సెల్‌ఫోన్ దొంగిలించినట్లు చెప్పారు. పెయింట్ దుకాణంలో బీగాలను పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.4వేలు ఒక హుండీని పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని రంగనాయకులు తెలిపారు. పుల్లారెడ్డి హాస్పిటల్ ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్‌షాప్‌లో, పాత బస్టాండ్ వద్ద ఉన్న గుడ్ల దుకాణంలో బీగాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నం చేశారు. డబ్బు లేకపోవడంతో వెనుదిరిగారని దుకాణదారులు తెలిపారు. దొంగతనం చేస్తుండగా తమ సీసీ కెమెరాలలో రికార్డు అయినట్లు చెప్పారు. మండల కేంద్రంలో ఒకే రోజు ఒక్క సారిగా నాలుగు షాపులు చోరీకి గురవడంతో ప్రజలు, దుకాణదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఇలాంటి దొంగతనాలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు, దుకాణ యజమానులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను వివరించారు. తహశీల్దార్ భీమే శ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. పలువురు రైతులు తమ భూమి సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సల్మాన్ రాజ్, పంచాయతీరాజ్ ఎఇ ఉదయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA
O.S.No. 217/2022
Palampalli Ayyavaru Reddy. ...Plaintiff
Vs
1. Smt. P.J.S.Manjula, W/o M.Maria Kumar.
2. Smt. M.Divyakala, D/o M.Maria Kumar.
3. M.Santhosh, S/o M.Maria Kumar.
All are residing at D.No.36/323-29 Padmavathi Nagar, Opp. Reddy Colony, Bypass Road, Kadapa City, Kadapa YSR District.
...Defendant No. 1to 3
SUMMONS TO THE DEFENDANTS NO 1 TO 3
That the above suit is filed by the plaintiff for recovery of promissory note amount and the matter is posted to 28.04.2023 for year appearance. Please take notice and appear on 08-07-2024 at 10.30 A.M. in the above Court either in person or through an advocate failing which the matter will be decided exparty.
//By Order of the Hon'ble Court//
U. SESHAIAH, B.Com., B.L.
Advocate for Plaintiff,
KADAPA.

రాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో
O.S.No. 1204/2022
మాదం బెల్లం చిన్నకొండయ్య. ...వాది
V/s
బొగ్గడి క్రిష్ణారెడ్డి, S/o చిన్నసుబ్బిరెడ్డి గారు గతించినందున ఈయన వారసుడు కుమారుడు బొగ్గడి సుబ్బారెడ్డి.
...ప్రతివాది
పై దావాలో ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను
To
బొగ్గడి సుబ్బారెడ్డి,S/o కీ.శే.బి.క్రిష్ణారెడ్డి, బలిజపల్లి, మామిళ్ళపల్లె పోస్టు, సి.కె.దిన్నె (మండలం), వైఎస్ఆర్ కడపజిల్లా.
అను మీరు, కీ.శే.బొగ్గడి క్రిష్ణారెడ్డి గారి వారసులైనందున వాది, దావా దాఖలు సవరణ షెడ్యూలు ఆస్థిపై సరియైన రిజిష్టరు సవరణ దస్తావేజును వ్రాయించమని మ్యాండేటరీ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ, పై దావాను సలిపియున్నారు. సదరు దావా యొక్క హాజరుకు గాను 15.07.2024వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 15.07.2024వ తేదీ ఉ.గం.10.30ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల, కోర్టువారికి తెలుపుకోనంతట పై దావాను మీ పరోక్షముగా తీర్మానించబడును.
తేది: 8/7/2024
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
M.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప నగరం.

రాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో
O.S.No. 77/2024
శ్రీమతి పాళెం లక్ష్మిదేవి ...వాది
V/s
1. వల్లంకొండు వరదరాజ
2. అల్లం శేషయ్య
...ప్రతివాదులు
పై దావాలో 2వ ప్రతివాది అల్లంశేషయ్యకు పత్రికా ముఖముగా సమను
To
D2. అల్లంశేషయ్య, S/o కీ.శే.పుల్లయ్య, సంఘంపేట, H/o పెద్దబెస్తవీధి, కడప నగరం.
అను మీరు 2వ ప్రతివాదిగా, వి.వరదరాజ గారు మొదటి ప్రతివాదిగా, వాది స్పెసిఫిక్ ఫర్మార్మెన్స్ ఆఫ్ అగ్రిమెంటు మరియు ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పై దావాను సలిపియున్నారు. సదరు దావా మీ యొక్క హాజరుకు గాను 18.7.2024వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 18.7.2024వ తేదీ ఉ.గం.10.30ని॥లకు మీరు ఖుద్దన గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టువారికి తెలుపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
తేది: 8/7/2024
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
M.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.

IN THE COURT OF THE HONORABLE III ADDL CIVIL JUDGE : KADAPA
O.S.No. 125/2024
1. Yerragundu Chandra Obul Reddy, S/o Obul Reddy, Hindu, aged 60 years, Residing at Mammusiddipalli Village, Pendilarri Mandal, Kadapa Dist.
2. Nimmakayala Subba Reddy, S/o Rami Reddy, Hindu, Aged 53 years, residing at Adhinimmayapalli, Vallur Mandal, Kadapa Dist.
...Plaintiff
Vs
Mandapati Saraswathi Devi, W/o M.Venkata Ramanaiah, C/o Swarna Latha Hindu, Aged 80 years, Residing at 43/114-3, Prakash Nagar, Kadapa City. ...Defendant
పై దావాలో వాదులైన యర్రగొండు చంద్రఓబుళరెడ్డి, నిమ్మకాయల సుబ్బారెడ్డి, ప్రతివాదులైన మీ పై 6-9-2017 అగ్రిమెంట్ మేరకు రిజిస్టర్ చేపించమని పై దావా దాఖలు చేసియున్నారు. మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల మీరు గానీ మీ వకీలు ద్వారా గాని 15-7-2024 ఉదయం 10.30 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.
//By Order of the Court//
V.RAMA MOHAN
K. RAMA MOHAN
B.N.AKBAR ALI KHAN
Advocates